## క్లుప్తంగా

### 'ఆరోగ్య సురక్ష'తో అందరికీ వైద్యం



ఆరోగ్య సురక్ష శిబిరంలో అందుతున్న వైద్యసేవలు పరిశీలిస్తున్న అధికారులు

భామిని: రాష్ట్రంలోని ప్రతీ కుటుంబం ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకులు కొండగొర్రి చంటి, బిడ్డిక అనంతరావు, ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి అన్నారు. మండలంలోని బొడ్డగూడలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. భామిని పీహెచ్‌సీ వైద్యాధికారి వి.సంతోషిలక్ష్మి, సీహెచ్‌ఓ భాస్కరరావు, ఎస్‌యూఓ అప్పారావు, వైద్య సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించాలనే లక్ష్యంతో గిరిజన గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైద్య శిబిరాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈఓపీఆర్డీ జి.కృష్ణారావు, డిప్యూటీ తహసీల్దార్ నిమ్మల శేఖరం, కార్యదర్శులు గొర్లె చిన్నబాబు, సవర నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

### వార్షిక ప్రణాళికల తయారీపై శిక్షణ



వార్డు మెంబర్లకు సూచనలిస్తున్న ఎంపీడీఓ సాల్మన్‌రాజు

గుమ్మలక్ష్మీపురం: పంచాయతీ వార్షిక పనుల ప్రణాళికల తయారీపై వార్డు మెంబర్లు దృష్టి సారించాలని ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వార్డు మెంబర్లకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక ప్రణాళికల తయారీపై శిక్షణ ఇచ్చారు. గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి గ్రామాభివృద్ధికి అవసరమైన పనులు గుర్తించి, వాటిని చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. ఈఓపీఆర్డీ జగదీష్‌కుమార్, తదితరులున్నారు.

### వసతిగృహ విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న యూహెచ్‌సీ వైద్య సిబ్బంది

పాలకొండ రూరల్: వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థుల ఆరోగ్య భద్రతపై సంక్షేమాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక యూహెచ్‌సీ వైద్యాధికారి తేజారత్నం అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక ఇందిరానగర్ కాలనీలో గిరిజన సంక్షేమ వసతి గృహంలో సికిల్‌సెల్ ఎనీమియాకు సంబంధించిన పరీక్షలు చేపట్టారు. ఈ వ్యాధి లక్షణాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆరోగ్య రక్షణకు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. వివిధ వసతిగృహాల్లో ఉన్న 180 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసినట్లు వైద్యులు తెలిపారు. హెచ్‌వీ రవణమ్మ, ఆశా కార్యకర్తలు పేకేటి శ్రీదేవి, జి.లక్ష్మి, రాధారాణి, కె.గౌరీశ్వరి తదితరులు సేవలందించారు.

# విధుల్లో చేరిన అంగన్‌వాడీలు



కురుపాం: అంగన్‌వాడీ కేంద్రం–3లో లబ్ధిదారుకు పౌష్టికాహారం అందజేస్తున్న కార్యకర్త సరోజ

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వంతో చర్చలు సఫలం కావడంతో అంగన్‌వాడీలు సమ్మె విరమించి తిరిగి విధుల్లో చేరారు. మండలంలోని భద్రగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న 101 అంగన్‌వాడీ కేంద్రాలు, 84 మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలు, సహాయకులు మంగళవారం విధుల్లో చేరినట్లు సీడీపీఓ సీహెచ్ సుశీలాదేవి తెలిపారు. సక్రమంగా విధులు నిర్వహించాలని, లబ్ధిదారులకు సకాలంలో పౌష్టికాహారం సకాలంలో పంపిణీ చేయాలన్నారు.

- సీతంపేట: మండల పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె విరమించి తిరిగి విధుల్లో చేరినట్లు సీడీపీఓ రంగలక్ష్మి తెలిపారు. విధుల్లో చేరిన కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.
- కురుపాం: అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె విరమించడంతో అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచున్నాయి. అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో తిరిగి విధుల్లో చేరినట్లు కార్యకర్తలు తెలిపారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీలో నిమగ్నమయ్యారు.

**ప్రభుత్వానికి కృతజ్ఞతలు**

పాలకొండ: ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలపై సానుకూలంగా స్పందించడం ఆనందదాయకమని సీఐటీయూ నేత దావాల రమణారావు అన్నారు. ఈ మేరకు పాలకొండ పట్టణంలో మంగళవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.హిమప్రభ, బి.అమరవేని తదితరులు పాల్గొన్నారు.



సీతంపేట: కార్యకర్తలకు సూచనలిస్తున్న సీడీపీఓ రంగలక్ష్మి



పాలకొండలో విజయోత్సవ ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

# భీమిలి సభకు తరలిరావాలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి, పార్టీ నాయకులు

భామిని: విశాఖ జిల్లా భీమిలిలో ఈనెల 27న నిర్వహించే వైఎస్సార్‌సీపీ ఎన్నికల శంఖారావ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని రాష్ట్ర ఆర్థిక అంచనాల కమిటీ చైర్మన్, పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పిలుపునిచ్చారు. భామిని మండల పార్టీ నాయకులు, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, జేసీఎస్ మండల కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, అలిజింగి రామినాయుడుతో కలిసి మంగళవారం సమావేశమయ్యారు. భీమిని సభలో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారన్నారు.

ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను వివరిస్తారని, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టేందుకు చైతన్యం నింపుతారని వివరించారు. అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు. వారితో పాటు పార్టీ మండల నాయకులు కొత్తకోట ఆంజనేయులు, ఎరుకుమజ్జి పాపినాయుడు, సర్పంచ్ తొగరాన శ్రీను, పతివాడ పగడాలమ్మ ఉన్నారు.

## ఎమ్మెల్యే పరామర్శ



మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావతి, పార్టీ నాయకులు

భామిని: మండలంలోని పెద్దదిమిలికి చెందిన పాస్టర్ పాలక రామారావు(47) ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మంగళవారం పెద్దదిమిలి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి కారణాలు తెలుసుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, మాజీ సర్పంచ్ అలిజింగి రామినాయుడు, సర్పంచ్ తొగరాన శ్రీను, పార్టీ నాయకులు బొడ్డేపల్లి ప్రసాద్, షణ్ముఖరావు, టంకాల శ్రీను, ఓడ రమణ ఉన్నారు.

## మహిళను లక్షాధికారిని చేయడమే సీఎం లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రతి మహిళను లక్షాధికారిని చేయడమే సీఎం జగనన్న లక్ష్యమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం పురపాలకసంఘం పరిధిలోని బొగ్గుల వీధిలో పట్టణ ప్రగతి యూనిట్ మిర్చి మసాలా తయారీ కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి కుటుంబాన్ని నడిపించడమే కాకుండా సమాజానికి మార్గదర్శకంగా నిలవాలనే ఉద్దేశంతో అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఎంతగానో ఉపయోగపడేలా ఇలాంటి తయారీ కేంద్రాలను స్వయం సహాయక సంఘాల ద్వారా ఏర్పాటు చేసి వారి కాళ్లపై వారు నిలబడడమే కాకుండా మరో 10మందికి ఉపాధి కల్పించేలా చూడడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. నియోజకవర్గం పరిధిలో బలిజిపేట మండలం గంగాడ గ్రామంలో రూ.కోటి, సీతానగరం మండలం చినభోగిలి మహిళా సంఘానికి రూ.30లక్షలు సబ్సిడీ రుణాన్ని మంజూరు చేయడమే కాకుండా వారి చేతివృత్తి వ్యాపార అభివృద్ధికి తోడ్పాటు అందించాలనే లక్ష్యంగా కృషిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోనుగౌరీశ్వరి, కౌన్సిలర్‌లు ఆర్. చిన్నంనాయుడు, బి.ఆనంద్, మెప్మా, సీఎంఎంలు, సీఓలు, ఆర్పీలు, స్వయం సహాయక సంఘాలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్వే సకాలంలో పూర్తి చేయాలి



కోమటిపేటలో కులగణన చేస్తున్న సిబ్బంది



వీరఘట్టంలో కులగణన సర్వే చేస్తున్న సిబ్బంది

పాలకొండ రూరల్: నగరపంచాయతీ పరిధిలో ఉన్న 20 వార్డుల్లో కులగణన సర్వేను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. పట్టణంలోని తొమ్మిదో వార్డు సచివాలయ సిబ్బందితో మంగళవారం కులగణన సర్వేపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు సేకరించిన వివరాలపై ఆరాతీశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పూర్తి సమాచారం సేకరించాలన్నారు. ఏకకాలంలో వివరాలు నమోదు చేయటం వలన సర్వర్ సక్రమంగా పనిచేయకపోవటం, సాంకేతిక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున ఉదయం 9 గంటలలోపు, సాయంత్రం 5 గంటల నుంచి సమయం కేటాయించటం వలన లక్ష్యాలను పూర్తిచేయటం సులభమవుతందన్నారు. వలంటీర్లు ప్రణాళికతో వ్యవహరిస్తే మిగిలిన 68 శాతం నమోదు ప్రక్రియను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయవచ్చన్నారు. క్షేత్రస్థాయిలో నమోదు ప్రక్రియను కమిషనర్ నేరుగా పరిశీలించారు.

**కులగణన వేగవంతం చేయండి**

వీరఘట్టం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణనను వేగవంతం చేయాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ సూచించారు. వీరఘట్టంలోని పలు వీధుల్లో సచివాలయ సిబ్బంది చేపడుతున్న కులగణన సర్వేను మంగళవారం పరిశీలించారు. తప్పులు లేకుండా పక్కాగా వివరాలు సేకరించాలని సిబ్బందికి సూచించారు.

# అగ్నిఅస్త్రంతో కత్తెరపురుగు నివారణ



కషాయాన్ని తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జియ్యమ్మవలస: మండలంలోని కన్నపుదొరవలస గ్రామంలో జొన్న పంట సాగుచేస్తున్న రైతులకు అగ్నిఅస్త్రం తయారీపై మంగళవారం జిల్లా ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ జి.అన్నపూర్ణ అవగాహన కల్పించారు. జొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు ఈ అగ్నిఅస్త్రం సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. కషాయాల వినియోగంతో సాగు ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడి పెరుగుతుందన్నారు. ఒక ఎకరాకు 10 కేజీల వేపాకు, 10 లీటర్ల ఆవు మూత్రం, కేజీ పచ్చిమిరపకాయలు, అరకేజీ వెల్లుల్లి, అరకేజీ పొగాకు తీసుకుని అన్నింటిని వేరువేరుగా రుబ్బి ఆవుమూత్రంలో కలిపి 3 సార్లు పొంగు వచ్చేవరకు మరగనివ్వాలి. చల్లారిన తరువాత వడపోసుకుని 25 రోజుల పంట కాలంలో ఒక ట్యాంకు నీటిలో పావు లీటరు కషాయం కలిపి పిచికారి చేసుకోవాలి. రెండో దఫాగా 50 నుంచి 60 రోజుల కాలంలో ట్యాంకు నీటిలో అర లీటరు కషాయం కలిపి పిచికారి చేసుకోవడం ద్వారా కత్తెర పురుగు నివారణ సాధ్యమవుతుందన్నారు. రైతు భరోసా కేంద్రాలను, రైతు సాధికార సంస్థ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వై.కృష్ణ, ఎం.మోహనదాస్ పాల్గొన్నారు.

# అర్హులను పథకాలకు ఎంపిక చేసేందుకే..



వికసిత్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి, తదితరులు

గరుగుబిల్లి: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అర్హులను ఆయా పథకాలకు ఎంపిక చేయడమే లక్ష్యంగా వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.పైడితల్లి తెలిపారు. మండల కేంద్రంతో పాటు పెద్దూరు గ్రామాల్లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రచార రథాలు, మొబైల్ వాహనాల ద్వారా గ్రామాల్లో సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 25 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర టీం సభ్యులు గఫూర్, విల్సన్ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం వికసిత్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.ఇందుమతి, ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, ఏపీఎం పి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

## సామూహిక దీపార్చన



వద్దాదివారి వీధిలో సామూహిక దీపార్చన చేస్తున్న భక్తులు

పాలకొండ రూరల్: అయోధ్య భవ్య మందిరంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని నగరపంచాయతీ పరిధిలో పలు వీధుల్లో భక్తులు మంగళవారం సామూహిక దీపార్చన కార్యక్రమాలు నిర్వహించారు. కోమటిపేటలో ఉన్న కృష్ణ మందిరం వద్ద మహిళలు కోలాటం ఆడుతూ శ్రీరామున్ని కీర్తించారు. వద్దాదివారి వీధిలో శ్రీరాముని పట్టాభిశేఖం, కళ్యాణ ఘట్టాలను మహిళలు ఆలపించారు. కోదండరామ, సీతారామ మందిరాల్లో విశేష పూజలు జరిగాయి. కోటదుర్గమ్మ దేవస్థానంలో ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్‌శర్మ పర్యవేక్షణలో అఖండ రామ నామస్మరణ, ప్రత్యేక భజన కార్యక్రమాలను చేట్టారు.

# వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేస్తున్న వైస్ ఎంపీపీ శరత్‌బాబు

కొమరాడ: మండలంలోని కంబవలస సచివాలయం పరిధి లక్ష్మీపేట గ్రామానికి చెందిన కద్రక రాజేష్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు వైఎస్సార్ బీమా పథకంలో పేరు నమోదు చేసుకుని ఉండడంతో తక్షణ సాయంగా రూ.10 వేలును వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు మంగళవారం మృతుని భార్య కద్రక అమలకు అందజేశారు. మిగిలిన మొత్తాన్ని నామినీ బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మునికుమారి, గ్రామ పెద్దలు ఉన్నారు.

## ఘనంగా నేతాజీ జయంతి

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి హెచ్‌ఎం లిల్లీరాణి పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య సాధనలో ఆయన పోరాటాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు.

# నేటి నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు



డిగ్రీ కళాశాల గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న క్రీడాపోటీల నిర్వాహకులు

పాలకొండ రూరల్: ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నియోజకవర్గ క్రీడాపోటీల నిర్వాహకులు వి.పుష్పనాథం, వ్యాయామోపాధ్యాయులతో కలిసి మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. క్రీడాపోటీల నిర్వహణకు గ్రౌండ్‌ను సిద్ధం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ డొంక త్రినాథులు మాట్లాడుతూ.. బుధవారం ఉదయం 8గంటల సమయంలో ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పోటీలను ప్రారంభించనున్నట్లు చెప్పారు.

జిల్లా, ఐటీడీఏ, పాలకొండ మండల క్రీడా నిర్వాహకులు ఎం.రామకృష్ణ, జాకబ్ దయానంద్, ఆర్.రాములు, ఎస్.వి.రమణ, సీతారామ్, తదితరులు క్రీడాప్రాంగణ తాజా స్థితిగతులు పర్యవేక్షించారు.

## పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ లావణ్య

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఇరిడి గ్రామంలో ఉన్న 85వ పోలింగ్ కేంద్రాన్ని పాలకొండ ఆర్డీఓ లావణ్య మంగళవారం తనిఖీ చేశారు. ఈ పోలింగ్ కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడంతో ఇక్కడ పోలింగ్ నిర్వహణ సాధ్యమవుతుందా లేదా, వసతులు ఎలా ఉన్నాయి, తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం సమీపంలో ఉన్న రైతుభరోసా కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ పోలింగ్ నిర్వహణకు అందుబాటులో ఉన్న వసతులపై ఆరాతీశారు. ఆమె వెంట తహసీల్దార్ జె.రాములమ్మ ఉన్నారు.

# భక్తజన శంబరం

- సిరిమానోత్సవానికి తరలివచ్చిన భక్తులు
- మొక్కులు చెల్లించి వేడుకున్న గిరిజన ప్రజలు

మక్కువ/సాక్షి ఫొటోగ్రాఫర్: పోలమాంబ జాతరకు తరలివచ్చిన భక్తిశ్రద్ధలతో అమ్మవారి సిరిమానోత్సవాన్ని దర్శించి అమ్మ కరుణా కటాక్షాలు తమపై ఉండాలని కోరుకున్నారు. లక్షలాదిగా తరలివచ్చిన సిరిమానోత్సవాన్ని తిలకించి పులకించారు. తమ ఇలవేల్పు ఎల్లవేళలా తమను కాపాడాలని ప్రార్థించారు. పోలమాంబ అమ్మవారి సిరిమానోత్సవం దృశ్యాల్లో కొన్ని మీకోసం.



పూజారి కాలికి పూజలు చేస్తున్న భక్తులు



పోలమాంబ అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



సిరిమానును మొక్కుతున్న భక్తులు



సిరిమానోత్సవాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ, డీఎస్పీలు





చిన్నారిని భుజంపై ఎక్కించుకుని జాతరకు వస్తున్న తండ్రి